

.. హరి 'సర్వోత్తమ'రావు

గ్రంథాలయ పితామహుడిగా, ఆంధ్రతిలక్‌గా దేశ వ్యాప్తంగా ఖ్యాతి గడించిన మహోన్నతుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు. శుక్రవారం ఆయన 66వ వర్ధంతి. 8లో▸



అభిషేకించిన పాలన్నీ..

మహానందిలో స్వామికి అభిషేకం జరుగుతుండగానే పాలు రుద్రగుండం కోనేరులోకి చేరాయి. అద్భుత జల సంపద స్వామివారి చెంతనే ఉందని వేదపండితులు తెలిపారు. 8లో▸




ఏప్రిల్ 12న రాష్ట్రస్థాయి సదస్సు

కర్నూలు మెడికల్ కాలేజీలో ఏప్రిల్ 12, 13వ తేదీల్లో ఫోరెన్సిక్స్ మెడిసిన్ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లు విడుదల చేశారు. 8లో▸

## న్యూస్‌రీల్

### ప్రతి రోజూ 20 ఎకరాల్లో 'భూసర్వే'



రికార్డులను పరిశీలిస్తున్న జేసీ బి.నవ్య

మద్దికెర: ప్రతి రోజు 20 ఎకరాల్లో భూసర్వే పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశించారు. మండల పరిధిలోని పెరవలి గ్రామ పరిసరాల్లో జరుగుతున్న భూసర్వే కార్యక్రమాన్ని గురువారం ఆమె పరిశీలించారు. రైతుల పట్టాదారు పాసు పుస్తకాలను పరిశీలించి భూమి కొలతల ప్రకారం సర్వే చేయించి రికార్డుల్లో నమోదు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అనంతరం మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలోని అసైన్డ్‌భూములను పరిశీలించారు. పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్, ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి పాల్గొన్నారు.

### పట్టుపరిశ్రమ సహాయకులకు త్వరలో పదోన్నతి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పట్టు పరిశ్రమ శాఖలో పని చేస్తున్న గ్రామ పట్టుపరిశ్రమ సహాయకుల(వీఎస్‌ఏ)కు పదోన్నతి లభించనుంది. ఉమ్మడి జిల్లాలో 11 మంది వీఎస్‌ఏలు పనిచేస్తున్నారు. వీరికి సాంకేతిక సహాయకులు(టీఏ)గా పదోన్నతి కల్పించనున్నారు. ఇప్పటి వరకు వీరు సచివాలయ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. పదోన్నతులు పొందడం ద్వారా వీరు పట్టుపరిశ్రమ శాఖ పరిధిలోకి వస్తారు. పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే జీఓ జారీ చేసింది. పదోన్నతులకు సంబంధించిన ఫైలు జేసీకి పంపారు. అక్కడి ఆమోదం పొందిన తర్వాత కర్నూలు, నంద్యాల జిల్లాల పట్టు పరిశ్రమ శాఖ అధికారులు పోస్టింగ్‌లు ఇస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

### అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ/రూరల్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారు. గురువారం కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో కమిటీ సభ్యులు ఆర్డీఓ కె.సందీప్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ నిర్మల, అడిషనల్ డీఎంహెచ్‌ఓ, సీడీపీఓ వరలక్ష్మి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కర్నూలు రూరల్, కోడుమూరు, వెల్దుర్తి మండలాల పరిధిలోని ఐదు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీ ఉండగా 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 11 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 40 అంగన్‌వాడీ ఆయా పోస్టులకు 200 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు 163 మంది హాజరైనట్లు ఐసీడీఎస్ పీడీ నిర్మల తెలిపారు.

**రేపు ఆదోని, 4న పత్తికొండ డివిజన్లలో..**

ఆదోని పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అలాగే పత్తికొండ డివిజన్‌లో 4 టీచర్ పోస్టులకు, 26 ఆయా పోస్టులకు వచ్చే నెల 4న ఇంటర్వ్యూలు జరపనున్నారు.

# పేదరికం.. సంక్షోభం

- 'సూపర్–6' అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఏడాదికి కుటుంబానికి రూ.75 వేల వరకు నష్టం
- పూర్తిగా పడిపోయిన ఆదాయం
- జిల్లాలో పెరిగిన వలసలు
- నేటి బడ్జెట్‌పైనే ప్రజల ఆశలు

రోగం వస్తే ఆసుపత్రి వెళ్లేందుకు ప్రజల చేతిలో డబ్బు ఉండటం లేదు. ఉచితంగా వైద్యం అందుకోవాలన్నా ఆరోగ్యశ్రీ పథకం సరిగ్గా అమలు కావడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తామనుకున్న మహిళల ఆశలు గల్లంతయ్యాయి. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నా ఖర్చు తడిసి మోపెడవుతోంది. సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం చరమ గీతం పాడటంతో పేదరికం క్రమంగా పెరుగుతోంది. బతుకు జీవుడా అంటూ పేదలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతుండటంతో తమ ఆశలు నెరవేరుతాయా లేదా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజల జీవన ప్రమాణాలు క్రమంగా తగ్గుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక జన జీవనంలో సంక్షోభం ఎదురైంది. 2024–25లో సంక్షేమ పథకాల అమలులో చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం 2025–26లోనైనా సంక్షేమంపై దృష్టి సారిస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. 2025–26 సంవత్సరానికి సంబంధించి శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తారా లేదా అనేది బడ్జెట్‌లో చేసే కేటాయింపులపై ఆధారపడి ఉంటుంది. తల్లికి వందనం, ఆడబిడ్డల నిధి, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగభృతి తదితర ఎన్నో హామీలు పెండింగ్‌లో ఉన్నాయి. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామంటూ ప్రకటించిన హామీ గాలిలో కలసి పోయింది. మహిళలు, నిరుద్యోగులు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు బడ్జెట్‌లో సంక్షేమానికి స్థానం ఉంటుందా.. అనే దానిపై ఆసక్తి చూపుతున్నారు.

**రైతులకు సాయం ఏదీ?**

గ్రామీణ జనాభాలో 85 శాతం మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయమే ప్రధాన ఆధారం. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వ్యవసాయం తిరోగమనంలోకి వెళ్లింది. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా అమలు చేయలేదు. పంటల బీమా సాయం కూడా ఇవ్వలేదు. 2023–24 రబీ సీజన్‌కు సంబంధించి ప్రకటించిన కరువు మండలాల్లో కేంద్ర బృందం పర్యటించింది. ఎన్‌డీఆర్‌ఎఫ్ కింద రాష్ట్రానికి ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటి వరకు కరువు రైతులకు ఎలాంటి ఉపశమనం ఇవ్వలేదు.

**పడిపోయిన జీఎస్టీ**

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు స్వస్తి పలకడంతో ప్రజల్లో కొనుగోలు సామర్థ్యం తగ్గిపోయింది. 2024 మార్చి నెల వరకు ప్రతి నెలా ఏదో ఒక సంక్షేమ పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నేరుగా నగదు విడుదల అయ్యేది. దీంతో వ్యాపారం కూడా పుంజుకునేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ఎలక్ట్రానిక్ గూడ్స్, దుస్తుల వ్యాపారం వంటివి పడిపోయాయి. 2023 డిసెంబరు నెలలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రూ.76.09 కోట్లు ఆదాయం వచ్చేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సంక్షేమం ఊసే లేకపోవడంతో 2024 డిసెంబరు నెలలో జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం రూ.72.93 కోట్లకు పడిపోయింది.



ఏ గ్రామం చూసినా వలస దృశ్యాలే..

**నాడు దర్జాగా.. నేడు దయనీయంగా**

జిల్లాలో నాడు దర్జాగా జీవించిన ప్రజలు నేడు దయనీయంగా బతుకుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదికి కుటుంబానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా సగటున రూ.75 వేల వరకు ఆర్థిక ప్రయోజనం లభించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తి అవుతున్నా సంక్షేమ పథకాలకు దిక్కే లేకుండా పోయింది. ప్రతి కుటుంబం సగటున రూ.75 వేలు నష్టపోయింది. ఆదాయం పూర్తిగా పడిపోవడంతో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు.

**పెరుగుతున్న పేదరికం**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదరికం నిర్మూలన లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది. 2014–2018 నాటి పరిస్థితులతో పోలిస్తే 2018–19, 2023–24 మధ్య కాలంలో పేదరికం గణనీయంగా తగ్గినట్లు నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేసింది. టీడీపీ హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 19.64 శాతం పేదరికం ఉంది. 2019–20 నుంచి సంక్షేమ పథకాల అమలు చేయడంతో పేదరికం ఉమ్మడి జిల్లాలో 12.84 శాతానికి తగ్గిపోయింది. దళారీల ప్రమేయం లేకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా నగదు బదిలీ చేయడాన్ని నాడు నీతి ఆయోగ్ ప్రశంసించింది. అయితే నాటి టీడీపీ పాలన పరిస్థితులే నేడు కూడా నెలకొన్నాయి. జిల్లాలో పేదరికం క్రమంగా పెరుగుతోంది. ఈ విషయం మార్చి తర్వాత వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**'ఉపాధి' కరువై..**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో వలసలు బాగా తగ్గిపోయాయి. ఈ విషయాన్ని పలు సర్వే సంస్థలు ప్రకటించాయి. 2022లో జిల్లా నుంచి 15,729, 2023లో 12,863 కుటుంబాలు వలస వెళ్లాయి. నాటి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట వేసింది. వ్యవసాయ ఉత్పాదకత గణనీయంగా పెరిగింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగుపడ్డాయి. ముందస్తుగా ఉపాధి పనులు కల్పించడంతో వలసలు తగ్గిపోయాయి. ప్రస్తుతం 'కూటమి' ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు. ఉపాధి హామీ పథకాన్ని తూతూ మంత్రంగా నిర్వహిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక గత ఏడాది అక్టోబరు నుంచే ప్రజలు వలస వెళ్లడం మొదలు పెట్టారు. జిల్లా నుంచి దాదాపు లక్ష కుటుంబాలు వలస వెళ్లాయి.

**ఎన్నికల సమయంలో టీడీపీ ఇచ్చిన హామీలు ఇవీ..**

- 18 ఏళ్లు నిండి 59 ఏళ్ల వరకు ఉన్న మహిళలకు ఒక్కొక్కరికి రూ.1,500 ప్రకారం ఇద్దరు ఉంటే రూ.3,000, ముగ్గురు ఉంటే రూ.4,500 ప్రకారం ప్రతి నెలా 'ఆడబిడ్డ నిధి' కింద ఇస్తాం.
- తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే పరిమితి విధించకుండా ఒకరు ఉంటే రూ.15,000, ఇద్దరు ఉంటే రూ.30,000, ముగ్గురు ఉంటే రూ.45,000 చెల్లిస్తాం. నలుగురు ఉంటే రూ.60 వేలు చెల్లిస్తాం.
- 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తాం.
- సూపర్–6లో భాగంగా రైతులకు ఏడాదికి రూ.20 వేలు, యువగళం నిధి కింద నిరుద్యోగులకు నెలకు రూ.3,000 చెల్లిస్తాం.

**ఇదీ దుస్థితి..**

- ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీలను 'పచ్చ' మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. చంద్రబాబు మాటలు నమ్మి ప్రజలు ఓట్లేసి గెలిపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు పూర్తి కావస్తోంది. ప్రధాన హామీల అమలును ఇప్పటి వరకు పట్టించుకోలేదు.
- ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఇచ్చే ప్యాకేజీ సరిపోదని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు రోగుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వానికి చెందిన ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఇటీవల వ్యాఖ్యానించారు.
- ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'నాడు – నేడు' పనులను ప్రభుత్వ పాఠశాలల్లో అర్ధాంతరంగా నిలిపివేసింది. దీంతో తడికల దాపున, కటిక నేలపై విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు.. మహిళల ఓట్ల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు.

**సంక్షేమం కొండెక్కింది**



కూటమి ప్రభుత్వంలో ఒక్క సంక్షేమ కార్యక్రమం కూడా అమలు కావడం లేదు. ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయి. అంతంత మాత్రం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లేవు. కూటమి ప్రభుత్వంలో మహిళల సంక్షేమం కొండెక్కింది. మహిళల ఉపాధికి ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదు.
– విజయలక్ష్మి, సర్పంచ్, పెద్దహుల్తి

**వ్యతిరేకత పెరుగుతోంది**



కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు. సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు.
–కోడి వెంకటేశ్వర్లు, సర్పంచ్, గోరుమానుకొండ, బేతంచెర్ల మండలం

**గిట్టుబాటు ధరలు లేవు**



మాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. గతేడాది పత్తి, ఆముదం పంటలు సాగు చేశాం. అధిక వర్షాలు, అనావృష్టి పరిస్థితులతో దిగుబడులు తగ్గాయి. పంటలకు గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడి కూడా రాలేదు. రైతులకు ఏడాది రూ.20 వేలు చెల్లిస్తామన్నారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు. 2025–26లోనైన సంక్షేమానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది.
– వెంకటేశు, రైతు, ముక్కెళ్ల, తుగ్గలి మండలం

## రూ.6.91 కోట్లతో నీటి ఎద్దడి నివారణ

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ జీ నాగేశ్వరరావు



కర్నూలు(అర్బన్): ప్రస్తుత వేసవిలో జిల్లాలోని పలు గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.6.91 కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీరు బీ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి తలెత్తలేదని, ఆయా ఎస్‌ఎస్ ట్యాంకుల్లో కూడా నీరు సమృద్ధిగా ఉందన్నారు. రానున్న మార్చి, ఏప్రిల్, మే నెలలను దృష్టిలో ఉంచుకొని క్షేత్ర స్థాయిలోని ఇంజినీర్ల ద్వారా ఎన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తవచ్చనే అంశంపై సర్వే నిర్వహించి నివేదికలను తెప్పించుకున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని 25 మండలాల్లోని 721 జనవాసాల్లో 191 జనవాసాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తవచ్చనే అభిప్రాయానికి వచ్చామన్నారు. ఇందులో 76 జనవాసాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా గ్రామాల్లోని ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడరాదని రూ.3.89 కోట్లతో రవాణాతో తాగు నీటిని సరఫరా చేయాలని ప్రతిపాదనలు రూపొందించామన్నారు. అలాగే రూ.1.2 కోట్లతో సమీప గ్రామాల్లో నీటి సోర్సులను అద్దెకు తీసుకోవాలని, ఎస్‌ఎస్ ట్యాంకులను నింపేందుకు రూ.5 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనాకు వచ్చామన్నారు. రూ.2.95 కోట్లతో బోర్లలో డీపెనింగ్, ఫ్లషింగ్ చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించామన్నారు. ఆదోని, కౌతాళం, ఆస్పరి, పెద్దకడుబూరు, కోసిగి, మద్దికెర, తుగ్గలి, వెల్దుర్తి మండలాల్లోని 115 గ్రామాలకు రవాణాతో నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చనే అభిప్రాయం మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అశేష భక్తజనం మధ్య మల్లన్న రథోత్సవం, (ఇన్‌సెట్) చిన్నారి భక్తిభావం



## పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలి

కర్నూలు(అర్బన్): ఇంటర్ పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని కార్మికశాఖ ఉప కమిషనర్ కే వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతున్నందున, ఆ సమయంలో పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్, నెట్ కేంద్రాలను మూసి వేయాలని తెలిపారు. అలా చేయని కేంద్రాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ!

- రేపటి నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి

కర్నూలు కల్చరల్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉండటంతో కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలి. నిర్దేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లు, వసతుల కల్పన తదితర విషయాలను ఆర్‌ఐఓ గురవ్య శెట్టి గురువారం విలేకరులకు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి వసతి, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులందరూ బెంచీలపై కూర్చొని పరీక్షలు రాసేందుకు బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 69 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం 23,098 మంది, ద్వితీయ సంవత్సరం 22, 227 మంది మొత్తం 45,325 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కర్నూలు జిల్లాలో చిప్పగిరి, కోసిగి, పత్తికొండ, దేవనకొండ, కృష్ణగిరి, గోనెగండ్ల, ఆలూరు జూనియర్ కళాశాలల్లోని 7 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. హాల్ టికెట్‌పై కాలేజ్ ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూం ఫోన్ 08518 222047 నంబర్‌ను సంప్రదించవచ్చు. విలేకరుల సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ మెంబర్లు కె.నాగభూషణ్ రెడ్డి, యు.పద్మావతి, జీఎస్ సురేష్ చంద్ర, డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్‌చార్జ్ కె. రమాదేవి పాల్గొన్నారు.

## వచ్చాడయ్యో స్వామి..!

- పార్వేట ముగించుకుని కొండకు చేరిన అహోబిలేశులు



పూజ చేస్తున్న పండితులు

ఆళ్లగడ్డ: తమ వివాహ మహోత్సవానికి భక్తులను ఆహ్వానించేందుకు పార్వేటగా కొండ దిగిన జ్వాలా నారసింహస్వామి, ప్రహ్లాదవరదుడు తిరిగి అహోబిలం క్షేత్రం చేరుకున్నారు. 33 గ్రామాల్లో పల్లకీలో విహరిస్తూ పార్వేట ముగించుకుని క్షేత్రం చేరుకున్న స్వామి వార్లకు వేద పండితులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. పొలిమేర దాక వేదపండితులు ఎదురేగి మంగళ వాయిద్యాలతో గోవింద నామ స్మరణ చేసుకుంటూ ఉత్సవమూర్తులను ఆలయ సన్నిధికి చేర్చారు. స్వామి రాకతో క్షేత్రంలో పండగ వాతావరణం నెలకొంది. పార్వేటగా గ్రామాల్లో సంచరిస్తూ అలసి పోయిన స్వామి వార్ల ఉత్సవమూర్తులకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టు పీతాంబరాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ పూజలు ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారయణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దిగువ అహోబిలంలో పూజల అనంతరం జ్వాలా నర సింహస్వామిని పల్లకీలో ఎగువ అహోబిలానికి చేర్చారు.

# హరహర మహాదేవ!

- వైభవంగా మల్లన్న రథోత్సవం
- మారుమోగిన శివనామస్మరణ
- కనుల పండువగా తెప్పోత్సవం
- నేడు బ్రహ్మోత్సవ క్రతువులకు యాగ పూర్ణాహుతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లన్న రథోత్సవం నయన మనోహరంగా సాగింది. మహాశివరాత్రి రోజు శ్రీభ్రమరాంబాదేవిని వివాహ మాడిన మల్లికార్జున స్వామి గురువారం సాయంత్రం క్షేత్ర పురవీధుల్లో రథంపై ఊరేగారు. ఓం నమఃశివాయ, శంభో..శంకర అని భక్తులు నినదిస్తుండగా రథోత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గంగాధర మండపం వద్దకు పల్లకీ మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం రథశాల వద్ద అర్చక వేదపండితులు రథాంగపూజ, రథాంగ హోమాది క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవ మూర్తులను రథంలో ఆశీనులు చేశారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు రథోత్సవ పూజలో పాల్గొన్నారు. అనంతరం సాత్వికబలిగా కొబ్బరి కాయ, గుమ్మడికాయలను సమర్పించారు. ఆ తర్వాత భక్తులు శివ నామ స్మరిస్తుండగా.. కళాకారుల ప్రదర్శనలు కొనసాగుతుండగా రథం ముందుకు కదిలింది. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రథోత్సవం నిర్వహించారు. రథంపై ఆశీనులైన స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించి నీరాజనాలు సమర్పించారు. ఓం నమఃశివాయ, శంభో శంకర అంటూ భక్తులు పరమేశ్వరుడిని కీర్తించారు. రథోత్సవం ముందు కళాకారుల నృత్యాలు, కోలాటాలు, డప్పువాయిద్యాలు, గొరవయ్యల నృత్యాలు, భాజాభజంత్రీలు, వివిధ కళాకారుల రూపాలు ఆకట్టుకున్నాయి. రథోత్సవం అనంతరం స్వామిఅమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద కనుల పండువగా తెప్పోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పుష్కరిణిలో తెప్పపై ఉంచారు. స్వామి అమ్మవార్లు తెప్పపై విహరిస్తుండగా భక్తులు దర్శించుకున్నారు.



పూజల్లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఈఓ శ్రీనివాసరావు తదితరులు



రథోత్సవంలో కళాకారుల ప్రదర్శనలు

**నేడు పూర్ణాహుతి**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ యాగాది క్రతువులకు శుక్రవారం పూర్ణాహుతి నిర్వహించనున్నారు. ఉదయం స్వామివారి యాగశాలలో అర్చకులు, అధికారులు పూజలు చేసి పూర్ణాహుతి జరపనున్నారు. అనంతరం వసంతోత్సవం, కలశోత్సవం, త్రిశూలస్నానం చేస్తారు. సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

## క్లుప్తంగా

### రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు రైల్వే స్టేషన్‌లో రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా.. కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండలం కాకరవాడ గ్రామానికి చెందిన దండే హరీష్‌రెడ్డి(28) బీటెక్ పూర్తి చేశాడు. రెండు రోజుల క్రితం జమ్మలమడుగు పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. గురువారం తెల్లవారుజామున 5 గంటలకు విజయవాడ నుంచి ధర్మవరం వెళుతున్న రైలు జమ్మలమడుగు స్టేషన్ సమీపంలోకి రాగానే హరీష్‌రెడ్డి ఒక్కసారిగా రైలు పట్టాలపై తల పెట్టాడు. దీంతో తల, మొండెం వేరయ్యాయి. కాగా బీటెక్ పూర్తి చేసినా ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

### భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లతో సీఐ రామాంజులు, పోలీస్ సిబ్బంది

మంత్రాలయం: కర్ణాటక మద్యాన్ని భారీగా స్వాధీనం చేసుకున్నట్లు మంత్రాలయం సీఐ రామాంజులు తెలిపారు. మంత్రాలయం పరిమళ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. కారులో కోడుమూరు మండలం పాలకుర్తి గ్రామానికి చెందిన ఈడిగ విజయ్‌కుమార్ గౌడ్, అదే మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన దూదేకుల షేక్షావలి అనే ఇద్దరు వ్యక్తులు 34 బాక్స్‌లలో 3264 జాన్స్ ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్స్ పట్టుబడినట్లు తెలిపారు. ఇందులో ఈడిగ విజయ్‌కుమార్ గౌడ్ పరారీ కాగా.. షేక్షావలి పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని , కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

### అనారోగ్యంతో వ్యక్తి బలవన్మరణం

కోసిగి: అనారోగ్యంతో మండల పరిధిలోని జుమ్మాలదిన్నె గ్రామానికి చెందిన తిక్కయ్య(50) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మద్యం తాగుడుకు బానిసై తిక్కయ్య అనారోగ్యానికి గురయ్యాడు. గురువారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి కోసిగి ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతిని భార్య మాదేవి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### మల్లన్న సేవలో కార్మికశాఖ మంత్రి సుభాష్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్ దర్శించుకున్నారు. గురువారం శ్రీశైల ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి ఆలయ రాజగోపురం వద్ద పీఆర్వో టీ.శ్రీనివాసరావు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు.

అశేష జనవాహిని మధ్య సాగుతున్న రామలింగేశ్వరుడి రథోత్సవం



## తేరుపై దివ్యతేజం

నందవరం మండల పరిధిలోని గురుజాల క్షేత్రంలో గురువారం రామలింగేశ్వర స్వామి మహారథోత్సవం నిర్వహించారు. భారీగా తరలి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో పార్వతి పరమేశ్వరులకు కల్యాణోత్సవం ఘనంగా జరిపారు. – నందవరం

కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



## కల్యాణ వైభోగం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సం కనులపండుగగా సాగింది. ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు వచ్చారు. ఉత్సవమూర్తులను తీసుకొస్తూ నిర్వహించిన ఎదురుకోళ్ల ఉత్సవం ఆకట్టుకుంది. – మహానంది



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



## సంగమేశ్వరం.. భక్తిపారవశ్యం

ప్రాచీన సంగమేశ్వరాలయంలో గురువారం శ్రీలలితా సంగమేశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇరు తెలుగు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని తిలకించారు. – కొత్తపల్లి



కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

# రాష్ట్రంలో అరాచక పాలన

- పతాక స్థాయికి కక్ష రాజకీయాలు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కల్లూరు: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. గురువారం 'సాక్షి'తో మాట్లాడారు. పోసాని కృష్ణమురళి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కక్షలతో రాజకీయ ప్రత్యర్థులను, కళాకారులను, విశ్లేషకులను అరెస్టు చేస్తున్నారన్నారు. గొంతుకు ఆపరేషన్ చేయించుకుని అనారోగ్యంతో ఉన్నా పోసానిపై చంద్రబాబు సర్కారు తన క్రూరత్వాన్ని ఆపలేదన్నారు. మహాశివరాత్రి రోజు హైదరాబాద్‌లో ఉన్న పోసాని ఇంటికి రాత్రిపూట పోలీసులను పంపి, అరెస్టు చేయించారన్నారు. ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతున్న వారిపై కక్ష తీర్చుకోవడానికి పోలీసు యంత్రాంగాన్ని, వ్యవస్థలను దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారన్నారు. అరెస్టు అయిన వ్యక్తికి న్యాయం సహాయం అందకుండా, బెయిలు రానీయకుండా, నెలల తరబడి జైల్లో అక్రమంగా నిర్బంధించేలా ఒక తప్పుడు సంప్రదాయాన్ని చంద్రబాబు తీసుకువచ్చారన్నారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వం, పోలీసుల తీరు మారడం లేదన్నారు. సోషల్ మీడియా వేదికగా 'పచ్చ' సైకోలు రోజూ చెలరేగిపోతున్నారన్నారు. మహిళలు, చిన్నారులు, కుటుంబ సభ్యులు ఇలా ప్రతి ఒక్కరిని టార్గెట్ చేస్తున్నారన్నారు. పోలీసులు పక్షపాతం వహిస్తూ వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఫిర్యాదులను తొక్కి తెడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన జరిగిన మంచితో పోల్చిచూస్తే కూటమి ప్రభుత్వ పనితీరు అత్యంత దారుణంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా రాష్ట్రంలో ప్రజలకు జరిగిన మంచి ఏమీ కనిపించడం లేదన్నారు.

# పోసాని అరెస్టు అనైతికం

- రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి



కర్నూలు (టౌన్): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి తప్పిదాలను రెండేళ్ల క్రితం విమర్శించిన పోసాని కృష్ణమురళిని అర్ధంతరంగా అర్ధరాత్రి అరెస్టు చేయడం అనైతికం అని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 'కూటమి' ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించి కేవలం కక్ష సాధింపు చర్యలకు అధికార పార్టీ నేతలు పాల్పడుతున్నారని ఆరోపించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 111 నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పోలీసులను అడ్డు పెట్టుకొని ఎప్పుడో పాత కేసులను తిరగదోడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బందులు పెట్టేందుకు ప్రభుత్వం దిగజారుడు విధానాలు అమలు చేస్తోందన్నారు.

**అసలు డిప్యూటీ సీఎం ఉన్నారా?**

రాష్ట్రంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉన్నారా అని ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల ముందు 30 వేల మంది మహిళలు కనిపించకుండా పోయారని పదే పదే చెప్పిన పవన్ తర్వాత ఒక్క మహిళనైన కనిపెట్టగలిగరా అని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ కార్యకర్తలు విమర్శలు చేసిన విషయాన్ని వీడియోలతో సహా కర్నూలు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఏం చేశారన్నారు. త్వరలో జమిలి ఎన్నికలు వస్తున్నాయని, ప్రజలే కూటమి ప్రభుత్వం భరతం పడతారన్నారు.

### లా సెమిస్టర్ పరీక్షల ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో గత ఏడాది జూన్‌లో నిర్వహించిన లా 3, 5 సంవత్సరాల కోర్సు 1, 3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలు, సెప్టెంబర్‌లో జరిగిన 5, 7,9 సెమిస్టర్ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి. వెంకట బసరావు ఆదేశాల మేరకు ఫలితాలు విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్‌ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 3 సంవత్సరాల ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్‌కు 56 మందికి 18, మూడో సెమిస్టర్‌కు 66 మందికి 20, ఐదో సెమిస్టర్‌కు 94 మందికి ఇద్దరు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్‌కు 12 మందికి 0, మూడో సెమిస్టర్‌కు 10 మందికి 1, ఐదో సెమిస్టర్‌కు ఇద్దరికి 0, ఏడో సెమిస్టర్‌కు 20కి 0, తొమ్మిదో సెమిస్టర్‌కు 12 మందికి ఇద్దరు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

### యువకుడి దుర్మరణం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు – దోర్నాల మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మండలంలోని శ్రీపతిరావు పేటకు చెందిన సుమిత్ర(26) అనే యువకుడు గురువారం ఉదయం పని మీద ఆత్మకూరుకు వచ్చాడు. పని పూర్తయిన తర్వాత బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా పట్టణ శివారులోని సొసైటీ గోడౌన్ వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో సుమిత్ర తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నారాయణ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాలు సేకరించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# 'రెడ్‌బుక్' అమలుపై ప్రజల తిరుగుబాటు



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి

- అక్రమంగా పోసాని కృష్ణమురళి అరెస్టు
- ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి

చిప్పగిరి: రాష్ట్రంలో మంత్రి నారా లోకేశ్ 'రెడ్‌బుక్' రాజ్యాంగం అమలు తారా స్థాయికి చేరిందని, దీనిపై ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని ఆలూరు ఎమ్మెల్యే బి. విరూపాక్షి అన్నారు. చిప్పగిరిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే మాట్లాడారు. పోసాని కృష్ణ మురళిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. అసలు ఏ కారణం చేత అరెస్టు చేస్తున్నారో పోలీసు సిబ్బందికి కూడా తెలియదన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు.. అనతి కాలంలోనే ప్రజల నుంచి అసంతృప్తి మూటగట్టుకున్నారన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్తేమీ కాదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా.. అక్రమ అరెస్టులే పనిగా పెట్టుకొని పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. 'రెడ్‌బుక్' రాజ్యాంగం అమలును పక్కన పెట్టి పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లోకనాథ్, ఓబులేసు, మల్లికార్జున, నాగరాజు, ధర్మేంద్ర, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

# అభిషేకించిన పాలన్నీ రుద్రగుండంలోకి..!

- స్వామి నుంచే నీరు ఉద్భవిస్తుందనడానికి ఇదే సాక్ష్యం
- అద్భుత దృశ్యాన్ని ఆసక్తిగా తిలకించిన భక్తజనం



రుద్రగుండం కోనేరులోకి చేరిన అభిషేకం పాలు

మహానంది: మహానందిలో ఎన్నటికీ తరగని స్వచ్ఛమైన నీటితో నిత్యం ప్రవహించే కోనేరులు ఓ మహాద్భుతం. స్వచ్ఛమైన గంగా జలం నీరు ఎక్కడి నుంచి వస్తుందనేది ఇప్పటికీ అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలింది. అయితే స్వయంభువుగా వెలిసిన మహానందీశ్వరుడి చెంత నుంచే నీటి ధార వస్తుందని పురాణాల్లోనూ, పెద్దలు చెబుతారు. అందుకు నిదర్శనాలు సైతం ఉన్నాయి. అందులో భాగంగానే మహాశివరాత్రి సందర్భంగా స్వయంభువుగా వెలిసిన మహానందీశ్వరుడికి బుధవారం రాత్రి లింగోద్భవం సందర్భంగా మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం జరిగింది. బోయిలకుంట్ల మెట్టకు చెందిన నిత్య పాల దాత దాడిశెట్టి వీరబ్రహ్మం ఏటా స్వామివారి అభిషేకానికి వంద లీటర్ల పాలు విరాళంగా ఇస్తారు. ఆ పాలతో బుధవారం అర్ధరాత్రి మహానందీశ్వరుడికి అభిషేకం చేశారు. అయితే పానవట్టం ద్వారా పాలన్నీ ఆలయం వెలుపలకు వస్తాయి. అయితే అభిషేకం జరుగుతుండగానే పాలు స్వామివారి కింది నుంచి రుద్రగుండం కోనేరులోకి చేరడాన్ని భక్తులు, ఆలయ అధికారులు గమనించారు. అద్భుత జల సంపద స్వామివారి చెంతనే అని చెప్పడానికి ఇదో పెద్ద నిదర్శనమని వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. ఈ ఆసక్తికరమైన దృశ్యాన్ని భక్తులు కనులారా తిలకించి.. ఓం నమఃశివాయ అంటూ ప్రణమిల్లారు.

# ఏప్రిల్ 12న ఫోరెన్సిక్ మెడిసిన్ రాష్ట్రస్థాయి సదస్సు



బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ఏప్రిల్ 12, 13వ తేదీల్లో ఫోరెన్సిక్ మెడిసిన్ రాష్ట్ర స్థాయి వార్షిక సదస్సు నిర్వహించనున్నట్లు ఆ విభాగాధిపతి, ఏపీఏఎఫ్ఎంటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ టి.సాయిసుధీర్ చెప్పారు. ఇందుకు సంబంధించి బ్రోచర్‌లను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాల ఆవిర్భావం(1957) నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ మెడిసిన్ స్పెషాలిటిలో రాష్ట్రస్థాయి వార్షిక సదస్సు నిర్వహించలేదన్నారు. మొట్టమొదటిసారి రాష్ట్రస్థాయి వార్షిక సదస్సును ఏపీ అకాడమి ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజి(ఏపీఏఎఫ్ఎంటీ) ఆధ్వర్యంలో ఏపీ ఫర్ మెడికాన్-2025 పేరుతో సదస్సు నిర్వహంచనున్నట్లు తెలిపారు. ఫోరెన్సిక్ ఫిజీషియన్-ఎ క్లినికల్ ఫోరెన్సిక్ మెడిసిన్ ఎక్స్‌పర్ట్ అనే థీమ్‌తో ఈ కాన్ఫరెన్స్ రూపొందించామన్నారు. సదస్సుకు హాజరయ్యేందుకు తప్పక రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

# చిరుతది సహజ మరణమే



చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న డాక్టర్లు, అటవీ సిబ్బంది

శ్రీశైలం/ప్రాజెక్ట్: శ్రీశైలం క్షేత్రపరిధిలోని రుద్రపార్క్ సమీపంలో మృతి చెందిన చిరుతది సహజ మరణమేనని శ్రీశైలం రేంజ్ అటవీ అధికారి పి.సుభాష్ తెలిపారు. చిరుత కళేబరానికి స్థానిక రేంజ్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి మహ్మద్ అబ్దుల్ రవూఫ్ షేక్, నేషనల్ టైగర్ కన్జర్వేటర్ అథారిటీ నామినీ కె.శంకర్, నాగార్జున సాగర్- శైలం వైల్డ్ లైఫ్ నిపుణులు డాక్టర్ అరుణ్ వెస్లీ, వెటర్నరీ డాక్టర్ పి.జుబేర్, సెక్షన్ ఆఫీసర్ మదన్, బీట్ ఆఫీసర్ ఠాగూర్ పాల్గొన్నారు. ఈ మేరకు రేంజ్ అధికారి సుభాష్ మాట్లాడుతూ.. చిరుత కొద్దిరోజుల క్రితం రుద్రపార్క్ గోడకు 30 మీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో సహజ మరణం చెందినట్లు గుర్తించామన్నారు. ఆ ప్రాంతంలో చిరుత ఎముకలు, వెంట్రుకలు, ఇతర అవశేషాలు లభించాయన్నారు. అయితే చిరుత మృతి చెందిన ప్రాంతం నుంచి రుద్రపార్క్ గోడ ప్రహరీపైకి కళేబరం ఎలా వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.



### నేడు 'సహకార' సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు, సీఈవోలతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సహకార వ్యవస్థ బలోపేతం , ఆర్థిక సుస్థితర తదితర వాటిపై సమావేశంలో చర్చించున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 పీఏసీఎస్‌లు, ఇతరత్రా పలు సంఘాలు ఉన్నాయి. 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు చేపట్టనున్నారు.

# గద్వాల జిల్లా వృషభాల జయకేతనం



చుంచు ఎర్రగుడిలో పోటీలో భాగంగా బండలాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: మండలంలోని చుంచు ఎర్రగుడి గ్రామంలో రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం స్వామి వారిని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, కబడ్డీ, బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఆరుపళ్ల వృషభాల బండలాగుడు పోటీల్లో విజేతలుగా గద్వాల జిల్లా ఎస్ఎస్‌కె బుల్స్ హర్షద్‌పాష, అబ్దుల్ బాషా వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచి రూ.40వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాలలో వరుసగా కర్నూలు బి.తాండ్రపాడు చిన్నరత్నం వృషభాలు, పందికోన, మల్యాలకు చెందిన ఎస్ఎస్‌వీవీ టైగర్స్, షేక్ మైమున్నా ఎద్దులు సంయుక్తంగా, నంద్యాల కొణిదెల వెంకటేశ్వర్లు , కోడుమూరు వర్కూరు తలారి రామచంద్ర వృషభాలు వరుసగా రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10వే లు, రూ.5వేలు నగదు గెలుచుకున్నాయి. అలాగే.. హోం టీమ్ టోర్నీ పేరుతో నిర్వహించిన రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీల విజేతగా గోనెగండ్ల జట్టు నిలిచి రూ.20 వేలు గెలుచుకుంది. తర్వాతి మూడు స్థానాలలో వరుసగా పంచలింగాల జట్టు, డోన్ వి.బొంతిరాళ్ల జట్టు, చుంచుఎర్రగుడి జట్లు నిలిచి వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు సొంతం చేసుకున్నాయి.

### నాణ్యమైన భోజనం అందించాలి



వర్సిటీ హాస్టల్ కిచెన్‌ను పరిశీలిస్తున్న వీసీ వెంకట బసవరావు

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ఉద్యోగులను ఆదేశించారు. ఆయన గరువారం వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌తో కలిసి వర్సిటీలోని మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, భోజన శాలలను పరిశీలించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మెస్ బిల్లులు విద్యార్థులకు అందుబాటులో ఉండేటట్లు చూస్తూనే నాణ్యత కలిగిన పదార్థాలను అందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, ఎలక్ట్రికల్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ ఉద్యోగులను ఆదేశించారు. హాస్టళ్లలో నీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

# గ్రంథాలయ పితామహుడు హరి సర్వోత్తమరావు

- నేడు గాడిచెర్ల 66వ వర్ధంతి



కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన గాడిచెర్ల విగ్రహం

కోవెలకుంట్ల: వందేమాతరం ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడిగా.. గ్రంథాలయాల అభివృద్ధికి విశిష్ట సేవలందించి గ్రంథాలయ పితామహుడిగా.. ఆంధ్రతిలక్‌గా దేశ వ్యాప్తంగా ఖ్యాతి గడించిన మహోన్నతుడు.. గాడిచెర్ల హరిసర్వోత్తమరావు. శుక్రవారం ఆయన 66వ వర్ధంతి. కర్నూలుకు చెందిన భాగీరథీబాయి, వెంకటరావు దంపతులకు 1883 సెప్టెంబర్ 14వ తేదీన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జన్మించారు. 1907లో ఎంఏ పూర్తి చేసి ఉపాధ్యాయ శిక్షణకు గాడిచెర్ల రాజమండ్రిలో ట్రైనింగ్ కళాశాలకు వెళ్లారు. ఉదయం కళాశాలకు వెళ్తూ రాత్రివేళల్లో నిరక్షరాస్య వయోజనుల కోసం రాత్రి బడులు ఏర్పాటు చేసిన ఘనత గాడిచెర్లదే. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న బాలగంగాధర్ తిలక్, లాలాలజపతి రాయ్, బిపిన్‌చంద్రపాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవడంతో గాడిచెర్లలో అంతర్గతంగా దాగి ఉన్న స్వాతంత్ర్య పిపాస, దేశభక్తి ఒక్కసారిగా పెల్లుబికాయి. సాహిత్యం, వయోజన విద్య, గ్రంథాలయోద్యమం , పత్రికా రచన, సంఘసంస్కరణ, సంఘీభావ ప్రకటనలు, సభలు, సమావేశాలతో గాడిచెర్ల జీవితం ముందుకు సాగింది. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్‌వారు బాలగంగాధర తిలక్‌ను అరెస్ట్ చేసిన రోజునే గాడిచెర్లను అరెస్టు చేసి వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీంతో ఆయనను ఆంధ్ర తిలక్‌గా అప్పట్లో అందరూ పిలిచేవారు. జైలులో ఉంటూనే అనేక గ్రంథాలు రచించారు. హోంరూల్ ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించడమే కాకుండా బ్రిటీష్ వస్త్ర బహిస్కారం, జాతీయ విద్య, కల్లు, సారా పికెటింగ్‌లో ఈయన కనుసన్నల్లో నడిచేవి. చిత్తరంజన్‌దాస్, మోతీలాల్ నెహ్రూ స్థాపించిన స్వరాజ్య పార్టీని ఆంధ్రలో అభివృద్ధి చేసేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం జిల్లా మార్కాపురం, గిద్దలూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ ప్రాంతాలతో ఉన్న నంద్యాల స్థానం నుంచి 1928లో పోటీచేసి మొట్టమొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అలాగే మద్రాసు కౌన్సిల్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు.